సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 23 । జూన్ । 2024



డయేరియా రాకుండా..

డయేరియా నియంత్రణపై కలెక్టర్ సమీక్షించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

- 8లో

శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ బదిలీ



శ్రీకాకుళం పీఎన్ కాలనీ: శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియాను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆమె ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లనున్నారు. ఆమె ఎన్నికల ముందు శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.

వారం రోజుల్లో బీటెక్, పీజీ ఫలితాలు


ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలో వారం రోజుల్లో బీటెక్ 8వ సెమిస్టర్, పోస్టు గ్రాడ్యుయేషన్ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల చేయనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. వర్సిటీ ఎగ్జామినేషన్స్ కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ మూల్యాంకనం చివరి దశకు చేరుకుందని తెలిపారు. మార్కుల జాబితాలు సిద్ధం చేసి ఫలితాలు విడుదల చేయనున్నట్లు చెప్పారు.

● పరిణయ కళ



తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీనివాస కల్యాణం ప్రాజెక్టులో భాగంగా నందిగాం మండలం పెంటూరు గ్రామంలో శనివారం శ్రీనివాస కల్యాణం వైభవంగా జరిగింది. టీటీడీ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ప్రధానార్చకులు బాలాజీ, వేద పండితులు, అర్చకుల బృందం వైశాఖన ఆగమశాస్త్రం పద్ధతిలో కల్యాణం నిర్వహించారు. – నందిగాం

● నేత్రోత్సవ హేల



నరసన్నపేట వేంకటేశ్వరాలయంలో గల జగన్నాథ స్వామికి శనివారం నేత్రోత్సవం వైభవంగా నిర్వహించారు. అలాగే కవిటిలోని జగన్నాథ స్వామి ఆలయంలోనే జ్యోష్ఠోత్సవం నిర్వహించారు. సంవత్సరం మొత్తం మీద జ్యేష్ఠ పౌర్ణమి రోజునే జగన్నాథ స్వామికి అభిషేకాలు జరుగుతాయి. – కవిటి, నరసన్నపేట

● పౌర్ణమి వేళ



కుంచాలకుర్మయ్యపేట గ్రామంలో దేవీ ఆశ్రమంలో శుక్రవారం పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పలు అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అలంకరించి కుంకుమపూజలను చేశారు. – ఎచ్చెర్ల

బెధరగొడుతున్నాయి

కోడి కొండెక్కి కూర్చుంది. టమాట మాట వినడం లేదు. అల్లమైతే అల్లంత దూరం పారిపోయేంతలా ధర పెరిగింది. కూరగాయల 'ధర'హాసం సామాన్యుడికి వికటాట్టహాసమై కనిపిస్తోంది. 20 రోజుల కిందట ఇంతలా ధరలు లేవు. ఇంతలోనే ధరలు విపరీతంగా పెరగడంతో సగటు జీవి మార్కెట్‌కు వెళ్లడానికే సంశయిస్తున్నాడు.



రైతుల్లేక వెలవెలబోతున్న శ్రీకాకుళం రైతు బజార్

- ప్రజల నెత్తిన ధరల భారం
- 20 రోజుల్లో పెరిగిన ధరలు
- రూ.295కు చేరిన చికెన్ ధర
- రూ.80 పైబడిన కిలో టమాట
- అల్లం, తెల్లుల్లి కిలో రూ.180

శ్రీకాకుళం:

జిల్లాలో నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. 20 రోజుల క్రితం ధరలతో పోల్చితే అన్ని సరుకుల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. కూరగాయలు కొనలేక పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రైతులు రైతు బజారులో కూరగాయలు విక్రయించకపోవడంతో మార్కెట్ వెలవెలబోతోంది. జూన్ ఒకటో తేదీనాటికి కిలో చికెన్ (స్కిన్‌లెస్) ధర రూ.270 ఉండేది. ప్రస్తుతం రూ.295కు చేరుకుంది. గుడ్డు ధర కూడా రూ.6 నుంచి రూ.7లకు చేరుకుంది. అల్లం, తెల్ల ఉల్లి ఈనెల మొదటి వారం నాటికి రూ.140 ఉండగా ప్రస్తుతం రూ.180లకు చేరుకుంది. రూ.30 ఉండే టమాట ధర ప్రస్తుతం రూ.80 కిలో పలుకుతోంది. రూ.26 ఉండే ఉల్లి కిలో ప్రస్తుతం రూ.40లకు చేరుకుంది. కందిపప్పు ఈ నెల ఒకటో తేదీ నాటికి రూ.188 నుంచి రూ.196కు ఆధార్ నూనె ప్యాకెట్ రూ.96 నుంచి రూ.101కు చేరుకుంది. బెండ, వంకాయలు, బీరకాయలు, పచ్చిమిర్చి వంటి కూరగాయల ధరలు కిలో రూ.40 నుంచి రూ.60 లకు చేరుకున్నాయి. నిమ్మకాయలు కిలో రూ.100లకు చేరుకుంది. అన్ని నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. కొత్తిమీర, పుదీనా వంటి వాటి ధరలు కూడా రెండింతలు రెట్టింపయ్యాయి. 200 గ్రాముల బరువు ఉండే కొత్తిమీర కట్ట ఈనెల 1వ తేదీ నాటికి రూ.20 ఉండగా ప్రస్తుతం రూ.60కు చేరుకుంది. పుదీనా రూ.10 నుంచి రూ.40లకు చేరుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో పండించిన పంట జిల్లా ప్రజల అవసరాలకు సరిపోక పోవటంతో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకునే వారు. ప్రస్తుతం దిగుమతి తగ్గిపోవటంతో పాటు జిల్లాకు వచ్చిన సరుకులు కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించటంతో ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వర్షాకాలం రాకముందే పరిస్థితి ఇలా ఉంటే వర్షాకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం భయపడుతున్నారు. వర్షాలకు పంట దెబ్బ తిని దిగుబడి తగ్గిపోయి ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. కృత్రిమ కొరతపై అధికారులు నిఘా వేస్తే ధరలు తగ్గే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

దిగుమతి తగ్గడంతోనే

ఇతర ప్రాంతాల నుంచి కూరగాయల దిగుమతి తగ్గటం వల్ల ధరలు పెరుగుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల్లో జిల్లాలోను, ఇతర ప్రాంతాల్లోను దిగుబడులు తగ్గిపోవటంతో ఇలాంటి పరిస్థితి వచ్చింది. రాష్ట్ర అధికారుల సూచనల మేరకు ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకుంటాం.

– నాగలక్ష్మిజ్యోతి, మార్కెటింగ్ ఏడీ, శ్రీకాకుళం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- మందులు అందుబాటులో ఉంచుకోవాలి
- కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించి, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా నో డయేరియాపై ముందస్తు చర్యలు చేపట్టి అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జీలాని సమూన్ ఆదేశించారు. ఆయన శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యారోగ్య శాఖ అధికారులతో సీజనల్ వ్యాధులపై సమీక్షించారు. స్కూల్ హెల్త్ కార్యక్రమం చేపడుతున్న పనులు, జిల్లా మాస్ మీడియా అధికారి నిర్వహించే పనులపై ఆరాతీశారు.

జిల్లాలో స్కానింగ్ సెంటర్ల పనితీరును మాస్ మీడియా అధికారి వివరించారు. డయేరియా నివారణకు చేపడుతున్న పనులపై జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బి.మీనాక్షి మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో స్టాప్ డయేరియా నిర్వహించడం జరుగుతోందన్నారు. లైన్ డిపార్ట్‌మెంట్ సిబ్బందితో సమన్వయం చేసుకొని అంగన్‌వాడీలకు, ప్రతి ఇంటిని సందర్శించి డేటా తీసుకుని, డయేరియా అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆశాడే రోజున అన్ని అంశాలపై శిక్షణ ఇవ్వాలని, చేతులు, పరిసరాలు శుభ్రపరచుకోవడంపై ఆశాలు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీటి సరఫరాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా సరి చేయాలని తెలిపారు. డయారియా కేసు గుర్తించిన వెంటనే చేపట్టాల్సిన చర్యలు వివరించారు. సమీక్షలో డీఐఓ ఐ.రాజేశ్వరి, ఉప వైద్య ఆరోగ్య అధికారి ఎం.ప్రసాద్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శాంతిశ్రీ, ఎపిడిమిలోజిస్ట్ డాక్టర్ పి.సుజాత, డీపీఎంఓ డాక్టర్ జీవీ లక్ష్మి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రకాష్ రావు, డీఎంఓ సత్యనారాయణ, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ సీపీ శ్రీదేవి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

600 మందికి ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఐటీఐలో ప్రవేశాలకు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ కొనసాగుతోంది. 1874 నుంచి 2083 ర్యాంకు వరకు విద్యార్థులకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించగా, 432 మందికి 211 మంది హాజరయ్యారు. 98 మందికి ప్రవేశాలు కల్పించారు. ఈ నెల 18 నుంచి ఇప్పటి వరకు 600 మందికి ప్రవేశాలు కల్పించారు. చివరి రోజు ఆదివారం 2304 నుంచి 2470 ర్యాంకు మధ్య విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. హాజరు కాని విద్యార్థులకు, సీటు రాని విద్యార్థులు కోసం ఈ నెల 25, 26 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియను ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్‌బాబు, ప్లేస్‌మెంట్ అధికారి కామేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు.

24 నుంచి 'మీ కోసం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: 'మీ కోసం' పేరుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం ఈనెల 24 సోమవారం నుంచి ప్రారంభం కానుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. ఆ రోజు సోమవారం ఉదయం 10 గంటల నుంచి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఇకపై ప్రతి సోమవారం ఫిర్యాదులు స్వీకరించి వాటికి సత్వర పరిష్కారం చేపడతామని చెప్పారు. ఈ ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన తెలిపారు.

బ్యూటీషియన్, ఫుడ్ బేవరేజ్ కోర్సుల్లో ఉద్యోగ అవకాశాలు

శ్రీకాకుళం రూరల్: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ బొల్లినేని మెడిస్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులు విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని సెకెండ్ ఫ్లోర్‌లో గల స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్ లేదా పదో తరగతి పూర్తి చేసిన నిరుద్యోగులు ఎవరైనా 18 నుంచి 28 ఏళ్లలోపు ఉన్న వారు స్త్రీ, పురుషులు అర్హులన్నారు. మూడు నెలలు కోర్సుల్లో ఉచితంగా శిక్షణ, భోజన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు రాగోలు జెమ్స్‌లో గల బొల్లినేని మెడిస్కిల్స్ ఆస్పత్రి లేదా 7680945357, 9121999654 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అఫిలియేషన్ కమిటీల పరిశీలన పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల పరిశీలనను అఫిలియేషన్ కమిటీలు శనివారం పూర్తి చేశాయి. ఉన్నత విద్యా మండలి ఆదేశాలు మేరకు జిల్లాలోని 87 ప్రైవేట్ డిగ్రీ కళాశాలల పరిశీలనకు 17 ద్విసభ్య అఫిలియేషన్ కమిటీలను వర్సిటీ అధికారులు నియమించారు. కళాశాలలను భౌతికంగా శుక్ర, శనివారాల్లో పరిశీలించిన కమిటీలు యాప్‌లో కళాశాలల మౌలిక వసతులు దృశ్యాలు అప్‌లోడ్ చేయడంతో పాటు పరిశీలన నివేదిక అందజేశాయి.

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్



ఒలింపిక్ దే రన్‌లో క్రీడాకారులు, క్రీడాసంఘాల ప్రతినిధులతో అతిథులు, అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలో శనివారం నిర్వహించిన ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా సాగింది. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, క్రీడాసంఘాలు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఒలింపిక్ డే రన్‌ను జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చిట్టి నాగభూషణరావుతో కలిసి డీఈఓ క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ ర్యాలీ ఆసాంతం కన్నులపండువలా జరిగింది. నగరంలోని పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ పాతబస్టాండ్ నుంచి వైఎస్సార్ సర్కిల్, పాలకొండ రోడ్, డే అండ్ నైట్ జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్ మీదుగా కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వద్దకు సాగింది. డీఈఓ మాట్లాడుతూ క్రీడలతో చక్కటి ఆరోగ్యం సాధ్యమవుతుందని అన్నారు. జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు. కోడిరామ్మూర్తి స్టేడియం పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు మాస్టారు, అథ్లెటిక్స్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు ఎంవీ రమణ, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి వై.పోలినాయుడు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలస కేవీకేలో ప్రదర్శించిన టార్చ్ రిలే

కేవీకేకు చేరిన టార్చ్ రిలే

ఆమదాలవలస: ఆమదాలవస కృషి విజ్ఞానకేంద్రానికి టార్చ్ రిలే శనివారం చేరిందని కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు కేవీకేలో దాన్ని ప్రదర్శించారు. దేశంలో మొట్ట మొదటి కృషివిజ్ఞాన కేంద్రం ప్రథమంగా పాండిచ్చేరిలో 1974వ సంవత్సరంలో ప్రారంభించారని, కేవీకేలు ఆవిర్భవించి యాభై ఏళ్ల పూర్తయిన సందర్భంగా అఖిల భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ పాండిచ్చేరి కేవీకేలో జ్యోతి టార్చ్ రిలేను మార్చి 31వ తేదీన ప్రారంభించారన్నారు. ఈ టార్చ్ రిలే ప్రతి కేవీకేకు వెళ్తుందన్నారు. ఈ టార్చ్ రిలే కేవీకే శాస్త్రవేత్తల బృందం వ్యవసాయ రంగంలో అందించిన సేవలకు ప్రతీకగా 11 అటారి జోన్లను కలుపుకుంటూ ఢిల్లీకి చేరనుందని తెలిపారు. ప్రస్తుతం ఈ టార్చ్‌ను రస్తగుంట బాయి కేవీకే నుంచి ఇక్కడ అందుకున్నామన్నారు. ఇక్కడి నుంచి కొండంపూడి కేవీకేకు అందించనున్నట్లు ఆమె తెలిపారు.

క్లుప్తంగా

ఓఎస్‌డీకి వీడ్కోలు



ఓఎస్‌డీ సుధాకర్‌బాబును సన్మానిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్‌ఎం పురం క్యాంపస్‌లో ఓఎస్‌డీగా పనిచేస్తూ శనివారం రిలీవైన ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబుకు అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన 2019 నుంచి ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో పనిచేస్తున్నారు. ఐదేళ్ల పాటు పనిచేసి, సేవలు అందించిన ఓఎస్‌డీ శనివారం రిలీవ్ అయ్యారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటగోపాల ధన బాలాజీ మాట్లాడుతూ విశ్రాంత ప్రొఫెసర్‌గా ఆర్జీ యూకేటీ క్యాంపస్ ప్రగతికి ఓఎస్‌డీగా సుధాకర్ బాబు కృషిచేశారని అన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, అకంట్ ఆఫీసర్ మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య



మృతి చెందిన నాగమణి (ఫైల్)

ఎచ్చెర్ల: లావేరు మండలం చిన్నమురపాక గ్రామానికి చెందిన సిరుపురపు నాగమణి (35) అనే మహిళ ఫ్యాన్‌కు ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే నాగమణికి భర్త సెల్లయ్యకు మధ్య మనస్పర్థలు ఉన్నాయి. ఎప్పటిలాగానే గురువారం సాయంత్రం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. భర్త మందలించడంతో క్షణికావేశానికి గురైన నాగమణి ఇంటిలోకి వెళ్లి గడియ పెట్టుకుని లుంగీ పంచెతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. అయితే వెంటనే స్పందించిన భర్త, కుటుంబ సభ్యులు తలుపులు విరగ్గొట్టి లోపలికి వెళ్లి ఆమెను కిందకు దించారు. వెంటనే శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈమెకు గ్రీష్మ (13) రమ్య (11) అనే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. నాగమణి తండ్రి ఫిర్యాదుమేరకు లావేరు ఎస్‌ఐ స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో 20 మేక పిల్లలు మృతి



మృతి చెందిన 20 మేక పిల్లలను పరిశీలిస్తున్న పశువైద్యుడు అనిల్‌కుమార్

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామంలో కుక్కల దాడిలో 20 మేక పిల్లలు మృతి చెందాయి. కొరసవాడ గ్రామానికి చెందిన పైసక్కి సిమ్మయ్య గ్రామ సమీపంలో ఉన్న జగనన్న కాలనీ నిర్మాణం జరుగుతున్న కొండ వద్దకు శనివారం ఉదయం మేకలను మేతకు తీసుకెళ్లారు. 20 మేకపిల్లలను బసవేసి చోట ఉంచారు. మేక పిల్లల వద్ద కాపలాకు ఎవరూ లేకపోవడంతో కుక్కలు దాడి చేసి 20 మేకపిల్లలను చంపేశాయి. సాయంత్రం 7 గంటల సమయానికి సిమ్మయ్య బస వద్దకు వచ్చి చూసేసరికి మేకపిల్లలు చనిపోయి కనిపించాయి. దీంతో గ్రామస్తులు అక్కడకు చేరుకుని పశువైద్యశాఖ అధికారులకు తెలియజేశారు. శనివారం రాత్రి పశువైద్యుడు పారశెల్లి అనిల్ కుమార్ అక్కడకు వెళ్లి పోస్టుమార్టం చేశారు.

సాఫీగా ప్రయాణిద్దాం

- రైలు ప్రయాణికులకు 'మదద్' సాయం
- సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రత్యేక యాప్ రూపకల్పన
- 35 రకాల సేవా లోపాలపై ఫిర్యాదు చేయవచ్చు



రైల్వే మదద్ యాప్

హిరమండలం: రైలు ప్రయాణంలో ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు రైల్ 'మదద్' పేరిట కొత్త యాప్‌ను రైల్వే శాఖ అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా ప్రయాణ సమయంలో 35 రకాల సేవల్లో లోపాలపై ఫిర్యాదు చేయవచ్చు. సమస్యను వివరించడంతో పాటు సంబంధిత ఫొటోను అప్‌లోడ్ చేసేలా యాప్‌ను రూపకల్పన చేశారు. ఈ యాప్‌లో ఫిర్యాదు చేసే ప్రయాణికులు రిజర్వేషన్, జనరల్, ప్లాట్‌ఫాం టికెట్‌లో ఏదో ఒక దాన్ని తప్పనిసరిగా తెలియజేయాలి. ప్రతి ఫిర్యాదుపై రైల్వే అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపడతారు.

ఏయే సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు

రైల్వే స్టేషన్‌లో అపరిశుభ్రమైన వాతావరణం, నీటి కొరత, వెయిటింగ్ హాల్‌లో సౌకర్యాల కొరత, రిజర్వేషన్ చేసినా వెయిటింగ్ జాబితాలో ఉండటం, టీటీ ఇతర సిబ్బంది అవినీతి, రైల్వే సిబ్బంది నిర్లక్ష్యం, దురుసు ప్రవర్తన, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, వస్తువుల అపహరణ, గొలుసు దొంగతనాలు, కొట్లాటలు, మద్యపానం, మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన, ఆకతాయిల వేధింపులు, మరుగుదొడ్లు, బోగీల అపరిశుభ్రత, నాణ్యత లేని ఆహారం, ప్యాంట్రీ కార్‌లో అపరిశుభ్రత, అధిక ధరలకు అమ్మడం, ఏసీ, లైట్లు, చార్జింగ్ పాయింట్లు పనిచేయకపోవడం, రైళ్ల రాకపోకల్లో ఆలస్యం, తదితర అంశాలపై యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి?

గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి రైల్ మదద్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. వ్యక్తిగత వివరాలు నమోదు చేయడం ద్వారా సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు చేయగానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసి యాప్ వినియోగానికి వీలవుతుంది. ఈ యాప్ ద్వారా ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న 35 రకాల సేవా లోపాలపై ఫిర్యాదు చేయవచ్చు. ఆధారాల కోసం ఫొటోలను సైతం యాప్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. అలాగే సంబంధిత అంశంపై ఎలాంటి చర్యలు చేపడితే బాగుంటుందో తెలుపుతూ సూచనలు ఇవ్వవచ్చు. ప్రతి ఫిర్యాదుకు ఒక రిఫరెన్స్ నంబర్ ఉంటుంది. ఈ నంబర్ ఆధారంగా తమ ఫిర్యాదు ఏ స్థాయిలో ఉందో తెలుసుకునే వెసులుబాటు ఉంది. సమస్య పరిష్కారం కాగానే ఫిర్యాదుదారుకు ఎస్‌ఎంఎస్, ఈమెయిల్ ద్వారా సమాచారం అందజేస్తారు.

నిరంతర పర్యవేక్షణ

రైల్ మదద్ యాప్‌పై రైల్వే అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. యాప్‌లో చేసిన ప్రతి ఫిర్యాదు వెంటనే రైల్వే జనరల్ మేనేజర్, డివిజనల్ మేనేజర్‌కు చేరుతుంది. ఫిర్యాదు స్థాయిని బట్టి సంబంధిత విభాగానికి చెందిన ముఖ్య అధికారిని అప్రమత్తం చేస్తారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తారు.

కార్యాలయం కూల్చివేత దురాగతమైన చర్య

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని కూల్చడం దురాగతమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఇది ముమ్మాటికీ కక్ష పూరిత చర్యేనని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు. శనివారం ఉదయం భారీ పోలీసు బందోబస్తుతో కార్యాలయాన్ని కూల్చడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక వైపు కోర్టు పరిధిలో ఉన్నా.. హైకోర్టు చట్టాన్ని మీరి వ్యవహరించవద్దని సీఆర్‌డీఏకి సూచించినా అవేవీ పట్టించుకోకుండా హైకోర్టును ధిక్కరించి పార్టీ కార్యాలయాన్ని కూల్చివేయడం దారుణమన్నారు. టీడీపీ పాలన ఎలా ఉండబోతుందో చెప్పడానికి ఇదే నిదర్శనమని అన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఇలాంటి సంఘటనలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తాయన్నారు.

'టీడీపీ విధ్వంసకాండకు నిదర్శనమే కార్యాలయం కూల్చివేత'



నందిగాంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పేరాడ తిలక్

నందిగాం: చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న విధ్వంసకాండకు నిదర్శనమే తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం కూల్చివేత అని వైఎస్సార్‌సీపీ నాయకుడు పేరాడ తిలక్ అన్నారు. ఆయన శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా దాడులు పెరిగాయని, ప్రజలు, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమయ్యాయని గుర్తు చేశారు.

రాష్ట్రంలో ఒకే పార్టీ ఉండాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ నాయకులపై, వారి ఇళ్లపై, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని, ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు వాటిని ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రతిపక్ష నేతకు ఉన్న సెక్యూరిటీని ఈ ప్రభుత్వం తగ్గించడం, అసెంబ్లీకి వస్తుంటే ఎమ్మెల్యేలతో హేళనగా మాట్లాడించడం చంద్రబాబుకు తగదని అన్నారు. సీఆర్‌డీ పరిధిలో వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఉండకూడదనే ఉద్దేశంతోనే కూల్చివేత మొదలుపెట్టారని, ఎంత చేసినా ప్రజల్లో వైఎస్ జగన్‌కు ఉన్న ఆదరణ తగ్గదని అన్నారు. కోటబొమ్మాళిలోని వంశధార స్థలంలో టీడీపీ కార్యాలయం ఉందని, వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా ఏనాడైనా దానిపై దాడి జరిగిందా అని ప్రశ్నించారు. అధికారం వచ్చాక ప్రజల ముందు నీతులు చెప్పిన చంద్రబాబు, కక్ష సాధింపు చర్యలు ఉండవని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రంలో ఇప్పుడు జరుగుతున్న దాడులకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. మేనిఫెస్టోలో చెప్పిన సూపర్ సిక్స్ నెరవేర్చి ప్రజలకు మేలు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, నాయకులు జడ్యాడ జయరాం, చిన్ని జోగారావు, కణితి నారాయణమూర్తి, తమిరె ఫల్గుణరావు, మడపాల సంజీవరావు పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో విచారణ వేగవంతం



దమ్మలవీధిలో ఎచ్చెర్ల పోలీసుల విచారణ

శ్రీకాకుళం క్రైమ్ : ఎచ్చెర్ల మండలం నవభారత్ జంక్షన్ సమీపంలోని నివాస గృహంలో ఈ నెల 18న ఓ మహిళపై ఆరుగురు మహిళలు దాడి చేసి, వివస్త్రను చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో సంచలనం కలిగించిన ఈ ఘటనకు సంబంధించి ఎచ్చెర్ల పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఈ క్రమంలో శనివారం ఉదయం శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న దమ్మలవీధికి ఎస్‌ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలోని ఎచ్చెర్ల పోలీసులు అధిక సంఖ్యలో రావడంతో ఆ ప్రాంతమంతా మహిళలు, యువతతో నిండిపోయింది. ఘటన రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో జరగడంతో పోలీసులకు తలనొప్పిగా మారింది. ఎచ్చెర్ల పరిధిలోనే మొదట దాడి జరగడంతో ఎస్పీ ఆదేశాలతో ఎచ్చెర్ల ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు అక్కడ నమోదు చేశారు. దాడి జరిగిన మరుసటి రోజే ఆరుగురిలో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం, రిమ్స్‌లో మరో మహిళ (అల్లిబిల్లి రాధ) పరారవ్వడం.. వీటిపై పత్రికల్లో వరుస కథనాలు వస్తుండటంతో ఎస్పీ జీఆర్ రాధిక విచారణ వేగవంతం చేయాలని ఎచ్చెర్ల పోలీసులను ఆదేశించారు. దీంతో శనివారం ఒకటో పట్టణ పీఎస్ పరిధిలో ఉన్న దమ్మలవీధికి ఎచ్చెర్ల ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఏఎస్‌ఐ శ్రీనివాసరావు, మరో ఐదుగురు కానిస్టేబుళ్లు వచ్చి సాక్షులను విచారించారు. అనంతరం భర్త వద్దే కదలలేని స్థితిలో ఉన్న బాధితురాలు దాసరి మంగ వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు.

బాధితురాలు పోలీసులతో మాట్లాడుతూ తనలాంటి పరిస్థితి ఏ స్త్రీకి రాకూడదని, తనకి చావు తప్ప సమాజంలో తిరిగే పరిస్థితి లేకుండా చేశారని కన్నీటిపర్యంతమయ్యారు. తన ఆరోగ్య పరిస్థితి బాగోలేదని, తనకు న్యాయం చేయాలని, నిందితులకు కఠినంగా శిక్ష పడేటట్లు చేయాలని కోరారు. ఎచ్చెర్ల ఎస్‌ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్పీ రాధిక పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే పరారైన నిందితురాలు, మరో నిందితురాలిని పట్టుకుని అరెస్టు చేస్తామని, బాధితురాలికి న్యాయం చేస్తామని చెప్పారు.

డయేరియా రాకుండా ముందస్తు చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వారం రోజుల్లో గ్రామాల్లో ఉన్న కాలువలను శుభ్రం చేయాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. జిల్లాలో డయేరియా వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డయేరియా, మలేరియా, పారిశుద్ధ్యంపై తహసీల్దార్లు, ఎంపీడీఓలతో ఆయన శనివారం కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, చికున్ గున్యాలపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డీపీఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత మూడు రోజులుగా ప్రత్యేక డ్రైవ్‌లో పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని, రోడ్లపై చెత్త లేకుండా చూడాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒక సారి క్లీనింగ్ చేయడం జరుగుతుందన్నారు. నీళ్ల ట్యాంకులు క్లీన్ చేసి క్లోరినేషన్ చేయాలని చెప్పారు. ఫాగింగ్ మిషన్‌లు ఎన్ని ఉన్నాయో అన్నింటినీ అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. నీరు నిల్వ ఉంటే ఆ నీరు తొలగించి ఆ ఫొటో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. చెత్త పక్కాగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు.

నీటి ట్యాంకుల క్లోరినేషన్

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ జీజే బెనహర్ మాట్లాడుతూ ప్రతీ నీటి ట్యాంకు క్లోరినేషన్ చేయాలని చెప్పారు. మ్యాన్‌హోల్స్ ఓపెన్ లేకుండా చూడాలని, పైపు లైన్ లీకేజీ లేకుండా చూడాలన్నారు. వాల్ పిట్స్ డ్రైగా ఉండే విధంగా చూడాలని తెలిపారు. బ్లాక్ స్పాట్స్ గుర్తింపు తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.మీనాక్షి మాట్లాడుతూ తాగునీటి పరిశుభ్రతపై ప్రజలను అవగాహన పరుస్తామన్నారు. ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటుచేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులను ఆదేశించారు. ఎక్కడైనా డయేరియా వస్తే వెంటనే అక్కడకు రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు చేరుకుని చర్యలు చేపట్టాలన్నారు. నీరు కలుషితం కాకుండా జాగ్రత్తగా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. బయలాజికల్ కంటామినేషన్ జరిగితే వెంటనే ఆ నీరు తాగకుండా నిలుపుదల చేయాలన్నారు. ఈ మూడు నెలలు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. పిల్లలకు జింక్ ట్యాబ్లెట్లు, ఓఆర్‌ఎస్ అందించాలని డీఎంహెచ్‌ఓ సూచించారు.

పార్టీ కార్యాలయం కూల్చివేత అప్రజాస్వామికం



పిట్ట దామోదరరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయాన్ని కూల్చివేయడం అప్రజాస్వామికమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ట దామోదరరావు అన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి కూటమి ప్రభుత్వ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లు, కార్యకర్తల ఇళ్లపై దాడులు చేయడంతో పాటు ఏకంగా పార్టీ కార్యాలయాల్ని కూల్చివేతకు ఒడిగట్టడం దారుణమన్నా రు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల అమలు పైన దృష్టి సారించకుండా, ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం ప్రజాస్వామ్య హితం కాదని పేర్కొన్నారు. దీన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

'ఐటీడీఏ మంజూరు చేయాలి'



మాట్లాడుతున్న వాబయోగి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ మంజూరు చేయాలని నూతన ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబయోగి అన్నారు. జిల్లాల విభజనలో సిక్కోలు ఆదివాసీలు ఐటీడీఏ కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారు శ్రీకాకుళంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాల విభజన జరిగిన నుంచి ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లాలో మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని అనేక ఉద్యమాలు చేశామని తెలిపారు. ఆనాడు ఐటీడీఏ ఏర్పాటుకు టీడీపీ హామీ ఇచ్చిందని, ఆ మేరకు మాట నిలబెట్టుకోవాలని కోరారు. దొంగ ఎస్టీ సర్టిఫికెట్లు పొంది ఉద్యోగుల చేస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీకాకుళం జిల్లాలో బెంతు ఒరియాలు లేరని ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు జిల్లా కలెక్టర్ నివేదిక అందజేశారని ఇప్పటికైనా ఈ రాజకీయ పార్టీలు, ఈ ప్రభుత్వాలు మిగతా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చకుండా ఆదివాసుల అస్తిత్వం కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెజ్జి కృష్ణ, సరుబుజ్జిలి మండల అధ్యక్షులు సవర శోభన్, శ్రీకాకుళం జిల్లా కార్యవర్గ సభ్యులు పాపారావు, జన్ని మోహన్, కె.హరీష్, ఎస్.జోగారావు, పి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



బూర్జ పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

బూర్జ: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ జీఆర్ రాధిక శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసులపై ఆరా తీశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. పరిసరాలన్నీ తిరిగి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఎస్‌ఐ జీవీ ప్రసాద్‌తో పాటు సిబ్బందితో మాట్లాడుతూ గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాల రవాణాపై ఓ కన్నేసి ఉంచాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మెలగాలని, వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. మండలంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నందున రాత్రి వేళలో గస్తీ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతి, ఆమదాలవలస సీఐ దివాకర్ యాదవ్, బూర్జ పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

'రూ.20వేల పెట్టుబడి సాయం అందజేయాలి'



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు

టెక్కలి: రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు అందజేస్తామనే ప్రభుత్వ ప్రకటనను తక్షణమే అమలు చేయాలని, సాగునీటి కాలువల్లో పూడికలు తొలగించి ఆయకట్టు భూములకు నీరు అందే విధంగా చూడాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు డిమాండ్ చేశారు. ఆయన శనివారం టెక్కలిలో సమావేశం నిర్వహించి మా ట్లాడారు. టెక్కలి మండలంలో 48ఆర్, 49 ఆర్ సాగు నీటి కాలు వల్లో పూడికలు తొలగించాలని, అలాగే జయకృష్ణాపురం, మోదుగువలస, శ్రీరంగం, ధర్మనీలాపురం తదితర గ్రామాలకు దాలి చెరువు నుంచి ముంపు ప్రభావం లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సాగునీటి కాలువల షట్టర్లకు, మదుములకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన విత్తనాల సరఫరాతో పాటు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం 15 మంది సభ్యులతో కమిటీను నియమించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు బి.మల్లయ్య, కార్యదర్శి బి.వాసుదేవరావు, వి.ధనుంజయరావు, జి.బాలాజీ, బి.కృష్ణారావు, బి.సోమేష్, గడ్డియ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సైనికోద్యోగికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో అపస్మారక స్థితిలో లోహిదాసు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం వంతెన వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ సైనికోద్యోగి తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. సన్యాసిపుట్టుగ ఎస్సీ కాలనీకి చెందిన నందూరి లోహిదాసు అనే మాజీ సైనికోద్యోగి మందస గురుకుల పాఠశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తుండగా, ఈదుపురం వంతెనపై రెండు గేదెలు పోట్లాడుకొని బైక్‌ను ఢీ కొనడంతో లోహిదాసు తీవ్రగాయాలతో రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు వెంటనే ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి తరలించారు. తలకు తీవ్ర గాయం కావడంతో పాటు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వైద్యులు బరంపురం పెద్దాస్పత్రికి తరలించారు.

ముగిసిన మధ్యవర్తిత్వ శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా న్యాయ సేవా సదన్‌లో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న న్యాయవాదులు మధ్యవర్తిత్వం 40 గంటల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు న్యాయవాదుల్లో మధ్యవర్తిత్వంపై అవగాహన పెంచేందుకు ఈ శిక్షణలు ఏర్పాటు చేశారు. సుప్రీం కోర్టు మధ్యవర్తిత్వం, సంధి ప్రాజెక్ట్ కమిటీ శిక్షకులు జి.శశీదేవి, సుదర్శన సుందర్‌లు తరగతులు నిర్వహించారు. శిక్షణ పొందిన న్యాయవాదులు ఈ మధ్యవర్తిత్వంపై అవగాహన పెంచుకుని, కక్షిదారులకు న్యాయం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. కార్యక్రమంలో ల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

భార్య, కుమార్తెలు అదృశ్యం



అదృశ్యమైన భార్య, పిల్లలు (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: తన భార్యతో పాటు తన ఇద్దరు కుమార్తెలు అదృశ్యమయ్యారంటూ శనివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డొంకూరు గ్రామానికి చెందిన మత్స్యకారుడు చీకటి చంద్రయ్య ఈ నెల 13న భార్య రాములమ్మ, 8, 5 ఏళ్ల వయస్సున్న కుమార్తెలను తన తల్లిదండ్రుల వద్ద తోడుగా ఉంచి చేపల వేటకు సముద్రంలోకి వెళ్లిపోయాడు. అదే రోజు సాయంత్రం వేట నుంచి ఇంటికి తిరిగి వచ్చే సమయానికి ఇంటి వద్ద భార్య, పిల్లలు లేకపోవడంతో కుటుంబ సభ్యులతో కలసి చంద్రయ్య బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్దకు వెళ్లి వాకబు చేశారు. మరుసటి రోజు నుంచి వివిధ గ్రామాల్లో గాలించినప్పటికీ జాడ కనిపించలేదు. దీంతో శనివారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి భర్త చంద్రయ్య ఫిర్యాదు చేశారు.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

శ్రీకాకుళం క్రైమ్ : తన భర్త వేధిస్తున్నాడంటూ ఓ మహిళ 100కు డయల్ చేసి రక్షణ కల్పించాలని మొరపెట్టుకుంది. అయితే ఆమెను రక్షించడానికి వెళ్లిన హెడ్ కానిస్టేబుల్‌పై ఓ ప్రబుద్ధుడు దాడి చేయడం కలకలం రేపింది. శుక్రవారం రాత్రి జిల్లాకేంద్రంలోని కలెక్టర్ బంగ్లా సమీపంలోని హరిజన వీధిలో జరిగిన ఈ ఘటన స్థానికులను విస్మయానికి గురిచేసింది. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హరిజనవీధికి చెందిన ఎచ్చెర్ల గణేష్ తన భార్యను వేధించడంతో ఆమె శుక్రవారం రాత్రి 100కు డయల్ చేసి సమాచారమిచ్చింది. ఒకటో పట్టణ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు వెంటనే అక్కడికి చేరుకుని అప్పటికే గొడవపడుతున్న గణేష్‌ను నియంత్రించడానికి ప్రయత్నించారు. దీంతో గణేష్ ఒక్కసారిగా హెచ్‌సీ నాగరాజుపై తిరగబడి దాడికి యత్నించాడు. ఈ క్రమంలో హెచ్‌సీ బట్టలు చిరిగిపోయినా గణేష్ నుంచి అతని భార్యను రక్షించగలిగారు. తన భర్త గణేష్‌పై ఆమె పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. ఇటీవలే రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నైట్ బీట్ విధులు నిర్వర్తిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ కనకరాజుపైనా ఓ రౌడీషీటరు తన సోదరునితో కలిసి కత్తితో దాడికి యత్నించిన సంగతి తెలిసిందే. జనాలను రక్షించాల్సిన పోలీసులపైనే దాడులు జరుగుతుంటే.. ఇక సామాన్యుల పరిస్థితేంటని స్థానికులు విస్తుపోతున్నారు.